# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. రాష్ట్ర అభివృద్ధికి, పునర్నిర్మాణానికి అధికారులంతా అంకితం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.
2. రాష్ట్రంలో టిడ్కో లబ్ధిదారులకు త్వరలో ఇళ్ళను కేటాయించనున్నామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.
3. అనకాపల్లిని ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తామని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ వెల్లడించారు.
4. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి - ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ రేపు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.
5. రక్షణ పరిశోధన రంగంలో భారత్ స్వావలంబన సాధించి ప్రపంచానికి స్ఫూర్తిగా నిలుస్తోందని రక్షణ శాఖ సలహాదారు జి.సతీష్‌రెడ్డి పేర్కొన్నారు.

=========================

రాష్ట్ర అభివృద్ధికి, పునర్నిర్మాణానికి అధికారులంతా అంకితం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. అమరావతి లోని రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్ల సదస్సు ఈ రోజు ప్రారంభమైంది. అన్ని జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవల ద్వారా సుపరిపాలనను అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులంతా ముందుకెళ్లాల్సిన అవసరముందని తెలుపుతూ,

వాయిస్ (30 సెకన్లు)

ఇలా ఉండగా అంతకుముందు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 13,326 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహిస్తున్నామని, తొలుతగా పైలెట్ ప్రాజెక్టుగా పిఠాపురం నియోజకవర్గంలో చేపడతామని తెలిపారు .

-------------------------

రాష్ట్రంలో టిడ్కో లబ్ధిదారులకు త్వరలో ఇళ్ళను కేటాయించనున్నామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తిరుపతిలోని కొరమేనుగుంట వద్ద నూతనంగా నిర్మితమవుతున్న బలిజ భవన్ పనులను ఈరోజు మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, అర్హులైన పేదలందరికీ ఇంటిని నిర్మించి ఇస్తామన్నారు. గృహ సముదాయాల్లో ఇప్పటికే రహదారులు, తాగునీటి సౌకర్యం, మురుగు కాల్వలు, విద్యుత్తు ఏర్పాటు జరిగి నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

---------------------------

అనకాపల్లిని ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తామని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ తెలిపారు. అనకాపల్లిలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, అనకాపల్లి నుంచి రాజమహేంద్రవరం వరకు జాతీయ రహదారిని ఆరు లైన్లగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. తుని నుంచి నర్సీపట్నం, చోడవరం, మాడుగుల మీదుగా విజయనగరం జిల్లా కొత్తవలస వరకు రహదారి సర్వేకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చిందని తెలిపారు. అనకాపల్లి రైల్వేస్టేషన్‌ను ఆధునిక వసతులతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కోసం నిధులు సమీకరించి వచ్చే రెండు మూడేళ్లలో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.

---------------------------

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి – ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ రేపు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. రేపటినుంచి 13వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 14న పరిశీలన, 16వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. 30వ తేదీన పోలింగ్, సెప్టెంబర్ 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. సెప్టెంబర్ 6వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు.

---------------------------

తల్లి పాలు అమృతంతో సమానమని, ప్రతి ఒక్కరూ తల్లి పాల వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంచుకోవాలని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు ముఖ్య కార్యనిర్వహణాధికారి లక్ష్మీషా తెలిపారు. అఖిల భారత పిల్లల వైద్యుల సమాఖ్య ఉమ్మడి కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని నిన్న విజయవాడలో నిర్వహించిన అవగాహన వాక్ థాన్ ను లక్ష్మీషా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీషా మాట్లాడుతూ తల్లిపాలు చంటిబిడ్డకు అమృతంలా పనిచేస్తాయన్నారు. అంతరాన్ని తగ్గిద్దాం, తల్లులందరూ తల్లి పాలు ఇచ్చేలా మద్దతిద్దాం అనే నినాదంతో జరుగుతున్న తల్లిపాల వారోత్సవాలను అందరూ విజయవంతం చేయాలని కోరారు.

---------------------------

శిశువుకు తల్లిపాలు ఇవ్వవలసిన ఆవశ్యకతను తెలియజేస్తూ దేశ వ్యాప్తంగా ఈ నెల ఒకటవ తేదీ నుండి జరుగుతున్న తల్లిపాల వారోత్సవాలు ఈరోజు ఐదవ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా తల్లిపాలను బిడ్డకు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుపుతూ తిరుపతిలోని రుయా ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈరోజు అవగాహనా ర్యాలీని నిర్వహించారు. తల్లిపాలు శిశువుకు తొలి ఆరోగ్య టీకాలా పనిచేస్తాయని రుయా సూపరింటెండెంట్ జి.రవిప్రభు ఆకాశవాణికి తెలుపుతూ...

..వాయిస్.. 26 సెకన్లు

చిత్తూరు నగరంలో తల్లి పాల వారోత్సవాల గురించి నిర్వహించిన అవగాహన ర్యాలీని నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణ ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాల వల్ల బిడ్డకు రోగనిరోధక శక్తి లభిస్తుందని తెలిపారు.

---------------------------

రక్షణ పరిశోధన రంగంలో భారత్ స్వావలంబన సాధించి ప్రపంచానికి స్ఫూర్తిగా నిలుస్తోందని రక్షణ శాఖ సలహాదారు, డీఆర్‌డీవో మాజీ అధ్యక్షులు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు. నిన్న కృష్ణా జిల్లా అవనిగడ్డలోని గాంధీ క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో మండలి వెంకటకృష్ణారావు స్మారక తెలుగు పురస్కారంతో సతీష్‌రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రక్షణ రంగాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలపడం తమ లక్ష్యమని తెలిపారు. కృష్ణా జిల్లా నిమ్మకూరులోని బెల్ కంపెనీ ద్వారా త్వరలో ప్రపంచ దేశాలకు ఎగుమతులు చేయనున్నామన్నారు. నాగాయలంక మండలం గుల్లలమోద గ్రామంలో క్షిపణి పరిశోధన కేంద్రం త్వరలో ప్రారంభమవుతుందని తెలిపారు.

---------------------------

సైబర్ నేరాలను తగ్గించేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో నిన్న ఏర్పాటు చేసిన సైబర్ కమాండోల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, సమాజంలో సైబర్ నేరాలను కట్టడి చేసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆన్ లైన్ యాప్‌ల ద్వారా, డీప్ ఫేక్, మెసేజ్, కేవైసీ అప్ డేట్, పోలీస్, కస్టమర్ కేర్, ఆర్మీ అధికారుల పేరుతో ప్రజలను సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారని అన్నారు. ఈ నేరాల కట్టడిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, దీనిలో భాగంగా సైబర్ కమాండోల ఏర్పాటును మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన -పీఎంజీఎస్‌వై పథకం ద్వారా రోడ్ల నిర్మాణానికి 400 కోట్ల రూపాయలను కేటాయించినట్లు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పీఎంజీఎస్ కింద రహదారుల నిర్మాణానికి కేంద్రం 17 వేల 163 కోట్ల రూపాయలను కేటాయించగా, వీటిలో రాష్ట్రానికి 400 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కేంద్రం మరో 70 కోట్ల రూపాయలను కేటాయించినట్లు ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఆయా రాష్ట్రాలకు లేఖలు రాసింది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి డి.శేషసాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్....36 సెకన్లు...

---------------------------

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి  నుంచి భారీగా వరద చేరుకుంటున్న నేపథ్యంలో ఈరోజు నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లను తెరిచి అధికారులు నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్ట్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, సీఈ అనిల్‌కుమార్ జలహారతి ఇచ్చి,  దిగువ ప్రాంతాల ప్రజల అప్రమత్తత కోసం మూడుసార్లు సైరన్ మోగించారు. అనంతరం ఒక్కొక్కటిగా ఆరు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. సాగర్ క్రస్టు గేట్ల ద్వారా దాదాపు 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

=======================